క్లుప్తంగా

మన్యంకొండలో ప్రభుత్వ సలహాదారు పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారిని ప్రభుత్వ సలహాదారు కేఎస్ శ్రీనివాసరాజు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ వివరించారు. అనంతరం టీటీడీ ఈఈ నరసింహమూర్తి, టీటీడీ డీఈ నాగరాజు, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డిలతో కలిసి మన్యంకొండలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను చర్చించారు. వారి వెంట ఆర్డీఓ నవీన్, తహసీల్దార్ సుందర్ రాజ్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, తదితరులు ఉన్నారు.

పాఠశాల విద్యార్థులకు బ్యాడ్జీలు పంపిణీ



నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంఈఓ నాగ్యానాయక్ బ్యాడ్జీలు పంపిణీ చేశారు. దాతల సహకారంతో 200 మందికి పైగా ఉన్న విద్యార్థులకు ఫొటోతో పాటు ఏర్పాటు చేసిన బ్యాడ్జీలు అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌ఎం దశరథ్ నాయక్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

దేవరకద్ర రూరల్: డోకూర్ సమీపంలోని తపోవన్ పాఠశాలలో సోమవారం రవి ఫౌండేషన్, రవి చిన్న పిల్లల ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం రవి వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, ప్రిన్సిపాల్ నిరంజన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 2006–07 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు బోధించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ స్వాధీనం

రాజాపూర్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలిపారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులోని బంగారు మైసమ్మ ఆలయం ముందు పోలీసులు ఇసుక ట్రాక్టర్‌కు అనుమతి పత్రాలు అడగటంతో డ్రైవర్ పత్రాలు చూపించలేదు. దీంతో ట్రాక్టర్ యజమాని మొల్గర ప్రశాంత్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుచ్చర్‌కల్ రోడ్డులో బ్లూకోర్టు సిబ్బంది గస్తీ తిరుగుతుండగా టిప్పర్ ఇసుక లోడ్‌తో అడ్డు రావడంతో ఆపి అనుమతి పత్రాలు అడగటంతో ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డైరీ ఆవిష్కరణకు తరలిన టీఎన్‌జీఓలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు లలిత కళాతోరణంలో సోమవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్ 2025 ఆవిష్కరణ కార్యక్రమానికి టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బయలు దేరారు. టీఎన్‌జీఓ కార్యాలయం నుంచి రాజీవ్‌రెడ్డి జెండా ఊపి వాహన శ్రేణిని ప్రారంభించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్ ఎలక్ట్రిసిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీనియర్ సిటిజన్ ఎలక్ట్రిసిటీ క్యాలెండర్‌ను విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్ టీఎస్‌టీయూసీ 327 యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. వచ్చే వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఎలక్ట్రిసిటీ ఫోరం కన్వీనర్ శ్రీనివాసులు, కో కన్వీనర్ నాగభూషణం, నవీన్‌కుమార్, లక్ష్మన్, చంద్రమౌళి, పుల్లారెడి పాల్గొన్నారు.

తృటిలో తప్పిన అగ్ని ప్రమాదం

జడ్చర్ల: బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్ ఎదుట చిరుతిండ్ల తయారీ బండి వద్ద సోమవారం తృటిలో అగ్ని ప్రమాదం తప్పిపోయింది. చిరుతిండ్లను తయారు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. వెంటనే అక్కడి వారు స్పందించి సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆపి నీల్లు చల్లి మంటలు ఆర్పారు. దీంతో బండి నిర్వాహకులు అగ్ని ప్రమాదం నుంచి బయటపడ్డారు.

వీధుల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తాం

- 20, 21వ వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్
- అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్



20వ వార్డులో ఓపెన్ నాలాను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనందర్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆయా వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 20, 21వ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలుచోట్ల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వీలైనంత త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు గోటూరు రాజు, మనీష్‌గౌడ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

స్థానిక వేంకటేశ్వరకాలనీలోని వీధిలో చేపట్టిన సీసీ రోడ్డు, పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కొత్త బస్టాండు సమీపంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మరుగుదొడ్లను పరిశీలించారు. త్వరలోనే వాటిని బాగు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గించవచ్చు



మాట్లాడుతున్న సీఐ భగవంతురెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: వాహనదారులు అందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చని ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం, మద్యం తాగకుండా వాహనాలు నడపటం, ఓవర్ స్పీడ్, రాష్ డ్రైవింగ్ చేయకుండా ఉండాలన్నారు. డ్రైవింగ్ చేస్తున్న సమయాల్లో మొబైల్ ఫోన్ మాట్లాడటం చేయరాదన్నారు. విద్యార్థులు, యువకులు తప్పక ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోని పాటించాలన్నారు.

- జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫాతిమా విద్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంవీఐ ప్రవీణ్‌కుమార్ హాజరై ఆర్టీఏ నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

మార్చిలోగా నర్సరీ పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

జడ్చర్ల టౌన్: మార్చిలోగా నర్సరీల్లో అన్ని పనులు పూర్తి చేయాలని డీఆర్‌డీఓ నర్సింహులు పిలుపునిచ్చారు. సోమవారం జడ్చర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలోజడ్చర్ల, మిడ్జిల్ మండలాల ఉపాధిహామీ సిబ్బంది, ఏపీఓ, ఈసీ, టీఏ, సీఓ, ఎఫ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా నర్సరీల పురోగతిపై విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరమైన కూలీలను పెంచుకోవాలని, మెటీరియల్ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నర్సరీల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం, ఏపీడీ శ్రీపాద్, ప్లాంటేషన్ అధికారి వెంకట్‌రెడ్డి, ఏపీఓలు విజయభాస్కర్, రాజేష్ రెండు మండలాల ఈసీలు, టీఏలు, సీఓలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ధర్మవ్యాధుడి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని సందర్శించిన ఆరె కటిక అభివృద్ధి సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆరె కటిక కుల దైవం ధర్మవ్యాధుడి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఆరె కటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి అశోక్ కుమార్ అన్నారు. సోమవార టీఎన్‌జీఓ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రైతయుగంలో ధర్మవ్యాధుడు మాంసం విక్రయవృత్తిలో కొనసాగుతూ వేదాలు పురాణాలు బోధించారన్నారు. అటువంటి మహానుభావుడిని పూజించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో జిల్లా కేంద్రంలో ధర్మవ్యాధుడి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని విగ్రహం ఏర్పాటు ప్రదేశమైన గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దివేష్‌జీ, వెంకటేశ్వర్‌జీ, మాంసం విక్రయ వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేకేడీ విజయబాబు, ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ రవీందర్, కోశాధికారి నరేష్ పాల్గొన్నారు.

నగర సంకీర్తనలో భజనలు

దేవరకద్ర: మండల కేంద్రంలో ధనుర్మాసం పురస్కరించుకుని సోమవారం తెల్లవారు జామున భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణంలోని పలు వీధులలో భజన పరులతో పాటు బాల బాలికలు భజన కీర్తనలు పాడుతూ తిరిగారు. అనంతరం అన్ని దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ధనుర్మాసం ముగిసే వరకు ప్రతిరోజు నగర సంకీర్తన నిర్వహిస్తున్నటు భజన మండలి వారు తెలిపారు.

అన్నప్రసాదాల పంపిణీ

దేవరకద్ర ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. మేస్త్రీ రాజు, బాలకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో అందించారు.

8వ పీయూలో విజయోత్సవ సభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో 8న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ బత్తిని రాము పేర్కొన్నారు. పీయూలో ప్రొఫెషనల్ కోర్సులు పెట్టేందుకు ప్రభుత్వం స్పందించి లా, ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసిందని, అందుకోసం విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గత 28రోజులు తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమగ్రశిక్ష ఉద్యోగులు సోమవారం విరమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన చర్చల్లో భాగంగా తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాజామైనొద్దీన్, విక్రమ్ పాల్గొన్నారు.

రైతు భరోసాపై బీఆర్‌ఎస్ నిరసన



జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్
- మండల కేంద్రాల్లో కాంగ్రెస్ హామీ పత్రాలు దహనం

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల్లో రైతులకు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఇచ్చింది. ఈ మేరకు రేవంత్‌రెడ్డి సర్కారు ఎకరాకు రూ.12వేలు ఇస్తామని ప్రకటించడంతో జిల్లా కేంద్రంలో, ఆయా మండలాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

- కౌకుంట్లలో బీఆర్‌ఎస్ నేతలు నిరసన తెలిపారు.
- భూత్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో పంట పొలాల వద్ద గోతితీసి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ పత్రాలను పూడ్చిపెట్టారు.



భూత్పూర్‌లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పత్రాలను గోతిలో పాతిపెడుతున్న నాయకులు

- అడ్డాకుల మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కాంగ్రెస్ ఎన్నికల హామీ పత్రాలను దహనం చేశారు.
- దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని పాత బస్టాండ్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.
- జడ్చర్లలో రైతు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నిరసన దీక్ష నిర్వహించారు.

సైన్స్‌ఫెయిర్‌పై అదనపు కలెక్టర్ సమీక్ష



జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి సైన్స్‌ఫెయిర్ నిర్వహణపై అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఎస్‌వీకేఎంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. ఏర్పాట్లను పరిశీలించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో సోమవారం శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. గురుస్వామి మణి గురుస్వామి, శేఖర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాపడి పూజలో గణపతిపూజ నిర్వహించిన అనంతరం అయ్యప్పస్వామి విగ్రహానికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు జంగిరెడ్డి కళాబృందం ఆలపించిన భక్తిగీతాలకు అక్కడున్న భక్తులు పరవసించిపోయారు. అనంతరం 18 మెట్లపై కర్పూరాన్ని వెలిగించారు. నారికేళ గురుస్వాములతో పాటు 60 మంది అయ్యప్పస్వాములు ఇరుమడిని నెత్తిన ఎత్తుకుని శబరియాత్రకు బయలు దేరారు. కార్యక్రమంలో బోళ్ల రాఘవేందర్, వెంకటయ్యగౌడ్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజావాణికి 5 ఫిర్యాదులు

దేవరకద్ర: దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నారు. మొత్తం 5 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రాజేందర్ ఆగర్వాల్, ఎంఈఓ బలరాం, పలువు అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు



మహమ్మదాబాద్: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సర్వే చేస్తోందని ఎంపీడీఓ దేవన్న తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా సోమవారం మండల పరిధిలోని మొకర్లాబాద్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించారని ఆయన తెలిపారు. పూర్తిగా ఇళ్లులేని వారికి త్వరలో ఇళ్లు కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రెండురోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారుడికి న్యాయమూర్తి జరిమానాతో పాటు జైలుశిక్ష విధించింది. ఇటీవల వన్‌టౌన్ పోలీసులు చేసిన తనిఖీల్లో మహేష్ అధికంగా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో సోమవారం మహేష్‌ను కోర్టులో హాజరుపరచగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.నిర్మల రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో పోలీసులు అతనిని జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ అప్పయ్య మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపటం రోడ్డు భద్రతకు ముప్పు కల్గించే నేరంగా పరిగణించబడుతుందన్నారు.

ఓన్‌ప్లేట్ వాహనాలను తొలగించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులకు నడుస్తున్న ఓన్‌ప్లేట్ వాహనాలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు రమేష్‌నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీం, సభ్యులు ఆంజనేయుడుగౌడ్, నిరంజన్, కేశవులు, నజీర్, శ్రీహరి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



కొల్లూర్‌లో వాలీబాల్ టోర్నీ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: గ్రామీణ క్రీడాకారులను మరింత ప్రోత్సహించి వారిలో ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొల్లూర్‌లో నిర్వహించిన పూలే, అంబేడ్కర్ 4వ ఓపెన్‌టూ ఆల్ వాలీబాల్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో చాలా మంది క్రీడాకారులు నైపుణ్యం ఉన్నా, సరైన ప్రోత్సాహం లేక వెనుకబడ్డారని, అందుకు వారికి చేయూత నివ్వాలన్నారు. అనంతరం 42 వాలీబాల్ టీంలకు సంబంధించి డ్రాలో ఆయన పాల్గొని క్రీడాకారులతో కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వహకులు చందర్‌నాయక్, ఖాజా, నిరంజన్, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు రఘు, రాజు, అనంతయ్య, బాల్‌రెడ్డి, సేవ్యా, రఘుగౌడ్, కృష్ణగౌడ్, తాహేర్, కృష్ణ, రమేష్, బాలకిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌కే దక్కింది



మాట్లాడుతున్న సంజీవ్ ముదిరాజ్

హన్వాడ: రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ సంజీవ్ ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 2004లో మాజీ సీఎం వైఎస్సార్ హయాంలో రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసి రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అదేవిధంగా ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీని ఒకే విడతలో చేసి రైతులకు భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 26న రైతులకు ప్రభుత్వం ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా కింద ఎకరానికి రూ.12వేల సాయాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారందరికీ ఈనెలలోనే రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హన్వాడలో పంచాయతీ కార్యాలయం ఎదుట టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్, డీసీసీ జనరల్ సెక్రటరీలు వి.కృష్ణయ్య, కృష్ణయ్య యాదవ్, నాయకులు వెంకటయ్య, లింగంనాయక్, రాంచందర్‌జీ, జాంగీర్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు రేట్లు పెంచాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన వామపక్ష నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పౌర సరఫరాల సంస్థ హమాలీ కార్మికులకు ఎగుమతి దిగుమతి రేట్ల పెంపు ఒప్పంద జీఓలు విడుదల చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు సురేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ పౌర సరఫరాల సంస్థలో హమాలీ కార్మికులకు 2024, 2025 ఎగుమతి దిగుమతి రేట్లపెంపునకు సంబంధించి రేట్ల పెంపు ఒప్పందం చేసి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటి దాకా ఎలాంటి జీఓ విడుదల చేయలేదన్నారు. ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రూ.26 నుంచి రూ.29లు పెరిగిందని, పెరిగిన రేట్లను 2024 జనవరి నుంచే ఏరియర్స్‌తో సహా అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, వెంకటేశ్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ సంస్థలతో ఆటో వాలాలకు నష్టం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రైవేట్ సంస్థల వల్ల ఆటో కార్మికులకు తీవ్ర నష్టం వస్తుందని ఆటో యూనియన్ జేఏసీ నాయకులు రాములుయాదవ్, నాగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ చౌరస్తా నుంచి సోమవారం వందలాది మంది ఆటో డ్రైవర్లు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రయాణికులను ఎక్కించుకునే రెండు ప్రైవేట్ సంస్థలు రావడంతో ఆటో కార్మికుల బతుకు అగమ్యగోచరంగా మారిందన్నారు. పెద్దపెద్ద నగరాలకే పరిమితమైన ఇలాంటి సంస్థలు పట్టణానికి రావడం అన్యాయమన్నారు. ఈ సంస్థల రాకతో ఆటో కార్మిక కుటుంబాల జీవనానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. వెంటనే ఈ సంస్థలు పట్టణం నుంచి వెళ్లిపోవాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో ఆటో యూనియన్ జేఏసీ నాయకులు షేక్ బాబుమియా, రాజు, కృష్ణ, చెన్నయ్య, ఆంజనేయులు, తిరుపతయ్య, యాదగిరి, మహేష్, హష్మి, శ్రీను, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



జామ తోటలో చెట్లకు సోకిన తెగులును పరిశీలిస్తున్న మహేందర్

రాజాపూర్: ప్రస్తుతం మామిడి తోటలు పూతదశలో ఉన్నాయని, సస్యరక్షణ చర్యలు తీసుకుని చీడపురుగుల నుంచి తోటలను కాపాడుకోవాలని హార్టికల్చర్ అధికారి మహేందర్ రైతులకు సూచించారు. సోమవారం రాజాపూర్ మండల కేంద్రంతో పాటు పరిధిలోని తిర్మలాపూర్, రాఘవాపూర్ గ్రామాల్లో మామిడి, జామతోటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు చెట్లకు నీటిని ఇవ్వని వారు జనవరి 15తేదీ నుంచి నీటిని అందించాలన్నారు. రైతులు బచ్చిరెడ్డి, వెంకట్‌రాజు, వెంకటేశ్వర్, సుధాకర్, తదితరులు ఉన్నారు.

వరి సాగులో మెళకువలు పాటించండి

మహమ్మదాబాద్: రబీ వరిసాగులో రైతులు తగిన మెళకువలు పాటించాలని వ్యవసాయాధికారి నరేందర్ తెలిపారు. మండలంలోని మొకర్లాబాద్, మంగంపేట్ తదితర గ్రామాల్లో వరినాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంట సాగు పద్ధతులపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అత్యధికంగా కాండంతొలుచు పురుగు చేరడం ద్వారా పంటను అధికంగా నష్టం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో రైతు నర్సింహారెడ్డి ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై కాంగ్రెస్ నేతల హర్షం



బొక్కలోనిపల్లి చౌరస్తాలో సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

మహబూబ్‌నగర్ రూరల్: రైతు భరోసా రూ.12 వేలు, భూమి లేని రైతు కూలీలకు రూ. 12 వేల ఆర్థిక సాయానికి మంత్రివర్గం ఆమోదం తెలపడంపై రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని బొక్కలోనిపల్లి గ్రామ చౌరస్తాలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రైతులు, రైతు కూలీలు బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మరింత మేలు చేయడం కోసమే రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నిజమైన రైతులకే ఎక్కువ పంట సాయం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల సాయం అందించబోతున్నామన్నారు. రేషన్‌కార్డు లేని వారికి కొత్త రేషన్‌కార్డులు ప్రభుత్వం జారీ చేయనుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, గోవింద్‌యాదవ్, ఫండరినాథ్, నాయకులు పాల్గొన్నారు.